సాక్షి అనకాపల్లి

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: విశాఖ దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకమాంబ అమ్మవారికి భక్తులు బుధవారం స్వహస్తాలతో జలాభిషేకం చేశారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల రక్తదానం

మధురవాడ: సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించి 30 యూనిట్లు సేకరించారు.



అనంత లోకాలకు..

4లో

అచ్యుతాపురం సెజ్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. టెన్త్‌లో 565 మార్కులు సాధించిన మరో బాలుడు కొన ఊపిరితో ఉన్నాడు.

న్యూస్‌రీల్

అమర్‌నాథ్‌కు అభినందనలు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌ను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, పార్టీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు చిటికెల వెంకటరమణ, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పాల్గొన్నారు.

నేటి నుంచి చందనోత్సవం టికెట్ల విక్రయం

సింహాచలం: ఈనెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవానికి రూ.300, రూ.1000 దర్శన టికెట్ల విక్రయాలు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. సింహాచలం కొండపైన దేవస్థానం పాత పీఆర్‌వో కార్యాలయం వద్ద, నగరంలోని పలు బ్యాంకుల్లో టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకుని ఆధార్ నెంబరుతో పూర్తిచేసి టికెట్లు నేరుగా పొందవచ్చన్నారు. సింహాచలంలోని యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లోను, అక్కయ్యపాలెం, కేజీహెచ్, మహారాణిపేటలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లో టికెట్లు లభిస్తాయని తెలిపారు. అలాగే బిర్లా జంక్షన్, సాలిగ్రామపురం(అక్కయ్యపాలెం) ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో టికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ వరకు మాత్రమే టికెట్లు విక్రయాలు జరుగుతాయన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం 7 నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు www. aptemples. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు పొందవచ్చని తెలిపారు.

కన్న కొడుకే కాలయముడు

- ఆస్తి కోసం తండ్రి హత్య



మాట్లాడుతున్న సీఐ నర్సింగరావు

రాంబిల్లి (అచ్యుతాపురం): ఆస్తి కోసం కన్న కొడుకే కాలయముడయ్యాడు. ఇద్దరు కిరాయి రౌడీలను మాట్లాడుకొని తండ్రిని హతమార్చాడు. రాంబిల్లి సీఐ నర్సింగరావు బుధవారం వెల్లడించిన వివరాలు.. రాంబిల్లి మండలం చిన్న కలవలాపల్లికి చెందిన జల్లి తాతారావు (65)ను ఈ నెల 21వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్లతో పొడిచి హతమార్చారు. దీంతో ఉలిక్కిపడిన పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. దర్యాప్తులో తేలిన వాస్తవాలు చూసి పోలీసులు సైతం నిర్ఘాంతపోయారు. జల్లి తాతారావు కుమారుడు జల్లి అప్పలరెడ్డి అప్పుల పాలయ్యాడు. తన తండ్రిని నాలుగు లక్షల రూపాయలు ఇవ్వమని అడిగాడు. దీనికి ఆయన నిరాకరించాడు. దీనికి తోడు ఆస్తిని పినతల్లి పిల్లలకు ఇస్తాడనే అనుమానంతో తండ్రిని హతమార్చాలని నిర్ణయించుకొన్నాడు. సారిపల్లి స్వరూప్, నక్కా రాజశేఖర్‌లకు రెండు లక్షల రూపాయల సుపారీ ఇచ్చి తండ్రి హత్యకు పురమాయించాడు. ఈ నెల 21వ తేదీన మేడపై నిద్రిస్తున్న తాతారావును వారు ఇనుపరాడ్లతో హతమార్చారు. హత్య జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు ప్రధాన నిందితుడైన అప్పలరెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును త్వరితగతిన పూర్తి చేసిన రాంబిల్లి పోలీసుల్ని ఎస్పీ అభినందించారు. దర్యాప్తులో ఎస్‌ఐ సింహాచలం, ప్రసాద్, నాగేంద్రలు పాల్గొన్నారు.

తగ్గిన ఉత్తీర్ణత.. పెరిగిన స్థానం



599 మార్కులు సాధించిన అనీషను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, పక్కన బాలిక తల్లిదండ్రులు

- టెన్త్‌లో గతేడాది కన్నా 0.56 శాతం తగ్గిన ఉత్తీర్ణత
- 88.44 శాతం ఉత్తీర్ణతతో 5వ స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లా
- 20,684 మందికి గాను 18,293 మంది పాస్
- 91.03 శాతం ఉత్తీర్ణతతో పైచేయి సాధించిన బాలికలు
- రాంబిల్లికి చెందిన అనీషకు 599 మార్కులతో స్టేట్ 2వ ర్యాంక్
- ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా 595 మార్కులు



వెంకట జయ
595 మార్కులు
(పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్)



పల్లా అనుష్క
592 మార్కులు
(పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్)



వి.వెంకట లక్ష్మి
592 మార్కులు
(తానాం గురుకుల పాఠశాల)

సాక్షి, అనకాపల్లి:

పది ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలిచారు. అనకాపల్లి జిల్లాలో 88.44 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా గతేడాదిలాగే మళ్లీ బాలికలే పైచేయి సాధించారు. జిల్లాలో బాలురు 85.88 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలు 91.03 శాతం ఉత్తీర్ణతతో దూసుకుపోయారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో ఫలితాలు వచ్చాయి. జిల్లాలో గతేడాది కన్నా ఒక శాతం ఉత్తీర్ణత తగ్గినా.. రాష్ట్రంలో ఐదో స్థానానికి ఎగబాగింది. గతేడాది 89 శాతం సాధించినా పదో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. జిల్లా నుంచి మొత్తం 20,684 మంది పరీక్షలు రాయగా వారిలో 18,293 మంది ఉత్తీర్ణులయ్యారు. 10,393 మంది బాలురకు 8,925 మంది, 10,291 బాలికలకు 9,368 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పలువురు విద్యార్థులు జిల్లా టాపర్లుగా నిలిచారు. సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 84.6 శాతం ఉత్తీర్ణత నమోదయింది. ప్రైవేట్ పాఠశాలలు 97 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అయితే బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో, ఏపీ ఆర్ఎస్ స్కూళ్లలో 99 శాతం ఉత్తీర్ణత, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లలో 96 శాతం ఉత్తీర్ణత వచ్చింది. జెడ్పీ హైస్కూల్స్‌లో 83 శాతం, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు 89 శాతం విజయం సాధించారు.

చీడికాడ మండలం టాప్

జిల్లాలోని 24 మండలాల్లో ఫలితాలను పరిశీలిస్తే.. చీడికాడ మండలం 96 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచింది. దేవరాపల్లి, గొలుగొండ మండలాల్లో అత్యల్పంగా 81 శాతం నమోదయింది.

ఐఐటీ సాధించి అమ్మానాన్నల కష్టం తీరుస్తా..



మౌనికకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు గోవింద, మహాలక్ష్మమ్మ

దేవరాపల్లి: అచ్యుతాపురం బాలికల గురుకుల విద్యాలయంలో చదివిన దేవరాపల్లి మండలం ఎం.అలమండ గ్రామానికి చెందిన కోసూరి మౌనిక 593 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. బాలిక తండ్రి గోవింద తాపీ మేస్త్రిగా, తల్లి మహాలక్ష్మమ్మ రోజువారీ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. కూలీ చేసి తల్లిదండ్రులు తనను చదివిస్తున్నారని, ఐఐటీ చదివి మంచి ఉద్యోగంలో చేరి వారి కష్టాలను తీరుస్తానని మౌనిక తెలిపింది.

నాటి సంస్కరణల ఫలితమే..

నాటి సంస్కరణలే నేడు పదిలో ఉత్తమ ఫలితాలను తీసుకొచ్చాయి. దశాబ్ద కాలం క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 90 శాతం మార్కులు రావడమంటే గగనంగా ఉండేది. కానీ గత మూడేళ్లుగా ఫలితాలు పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టాప్ లేపుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారు. సంకల్ప బలం ఉండాలే గానీ అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విద్యాసంస్కరణలు నిరూపించాయి. ఎంతో దూరదృష్టితో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, విద్యా బోధనలో సమూల మార్పులు, నాడు–నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ నేటి ఫలితాలకు మూలంగా మారాయి.

జిల్లాలో టాపర్స్ వీరే..

యలమంచిలిలో శ్రీచైతన్య స్కూల్‌లో చదివిన అనీషకు 599 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా 595 మార్కులను పరవాడ మండలం పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎ.వెంకట జయ సాధించింది. అచ్యుతాపురం ఏపీఆర్ఎస్ (బాలికలు)లో చదివిన కోసూరి మౌనికకు 593 మార్కులు, పరవాడ మండలం పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పల్లా అనుష్కకు 592, పరవాడ మండలం తానాంలో గల రెసిడెన్షియల్ స్కూల్లో చదివిన వాసిరెడ్డి వెంకటలక్ష్మికి 592 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఐదుగురికి 590 మార్కులు వచ్చాయి. ఏపీఎస్ఎస్ రామ గాయత్రి (చోడవరం జెడ్పీ హైస్కూల్), గుంపన ఉదయ్‌కుమార్ (దేవరాపల్లి జెడ్పీ హైస్కూల్), మలసాల శరణ్య శ్రీలక్ష్మి (కశింకోట జెడ్పీ హైస్కూల్), నబి తనుశ్రీ (చీడికాడ సోషల్ వెల్ఫేర్ స్కూల్), కుండల లిఖిత (అనకాపల్లి మున్సిపల్ స్కూల్) ఈ ఘనత సాధించారు.

కలాసీ కొడుకు సాధించిన ఘనత



ఉదయ్‌కుమార్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు సత్తిబాబు, లక్ష్మి

దేవరాపల్లి: వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గుంపాన ఉదయ్‌కుమార్ 590 మార్కులు సాధించాడు. తిమిరాంకు చెందిన విద్యార్థి తండ్రి సత్తిబాబు ప్రతి రోజూ అనకాపల్లి వెళ్లి కలాసీ పనిచేస్తుండగా, అతని భార్య లక్ష్మి రోజువారీ కూలి పనులు చేస్తుంది. ప్రతి రోజూ 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేచలం హైస్కూల్‌కు వెళ్లి చదువుకున్నానని ఉదయ్ కుమార్ తెలిపాడు. భవిష్యత్‌లో ఇంజినీర్‌గా స్థిరపడి తన కోసం తమ తల్లిదండ్రులు పడిన కష్టాలను తీరుస్తానని చెప్పాడు. తమ కుమారుడికి 590 మార్కులు రావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ స్వీట్లు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు.

సైంటిస్టు కావాలన్నది నా లక్ష్యం



రమా గాయత్రి

చోడవరం రూరల్: భవిష్యత్తులో విద్యా రంగంలో రాణించి సైంటిస్టు స్థాయికి ఎదగాలన్నది తన లక్ష్యమని రమా గాయత్రి తెలిపింది. చోడవరం జెడ్పీ హైస్కూల్లో చదివిన ఈ బాలిక 590 మార్కులు తెచ్చుకొని మండలంలో ప్రథమ స్థానంలో నిలవడమే గాకుండా అనకాపల్లి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించింది. ఆమె తండ్రి ఎ.రమేష్ మోటార్ మెకానిక్. భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని నేటి నుంచే ఆ దిశగా పయనిస్తానని, తల్లిదండ్రుల కల నిజం చేస్తానని చెప్పింది.

వైఎస్సార్ సీపీ శాంతి ర్యాలీ

- కశ్మీర్‌లో ఉగ్రదాడికి ఖండన



కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

అనకాపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీ చేశారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని నెహ్రూ చౌక్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదుల పిరికిపంద చర్యను ప్రపంచం మొత్తం ఖండిస్తుందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్న మట్టు పెట్టాలని, బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఉగ్రవాదులను పట్టుకొని ఉరి తీయాలని మండిపడ్డారు. పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు
- ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్



పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల:

ఈనెల 30న జరిగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్)కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సమన్వయ కమిటీతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాల్లో 9,022 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలన్నారు. ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించాలని, నర్సీపట్నం, అనకాపల్లిలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ షాపులు, నెట్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు.

ప్రశ్నాపత్రాలను భద్రపరచడానికి అనకాపల్లి, నర్సీపట్నం పోలీస్ స్టేషన్లలో సేఫ్ కస్టడీ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, తాగునీరు వంటి మౌలిక వసతులు, ప్రత్యేక బస్సులు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో జిల్లా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష సమన్వయ అధికారి ఐ.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.శాంతిప్రభ, కలెక్టర్ కార్యాలయం సమన్వయ అధికారి ఎస్.వాసు నాయుడు, కమిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాపై దాడి గర్హనీయం



అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



కలెక్టర్, జేసీలకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

- ఏలూరు 'సాక్షి' కార్యాలయంపై దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు

అనకాపల్లి టౌన్: ఏలూరు సాక్షి కార్యాలయంపై టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేయడాన్ని ఖండిస్తూ సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దాడికి కారణమైన వారందరినీ అరెస్ట్ చేయాలని జర్నలిస్టు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం అనకాపల్లిలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ సెక్రటరీ సోమసుందర్ పాల్గొన్నారు. ఒక వేళ ఏదైనా పత్రికలో అవాస్తవాలు ప్రచురిస్తే.. మీకు అన్యాయం జరిగిందని భావిస్తే దానికి కోర్టుల్లో న్యాయపరంగా పోరాడాలని, జర్నలిస్టులపై కేసులు, మీడియా కార్యాలయాలపై దాడులు జరపరాదని అన్నారు. ఇలాంటి చర్యలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవిలకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని తమ ఎమ్మెల్యేలను అదుపు చేసుకోవాలని అందులో సూచించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు, రాష్ట్ర నాయకులు స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల కిషోర్, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు సీహెచ్‌పీఎల్ స్వామి, ఏపీడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కోశాధికారి కోయిలాడ చంద్రశేఖర్, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ బి.ఎన్.వి.లోవరాజు, ఏపీయూడబ్ల్యూజే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళి భౌతికకాయానికి నివాళి



శాంతి ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు





చంద్రమౌళి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

సాక్షి, విశాఖపట్నం: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన జరజాపు చంద్రమౌళి మృతదేహం బుధవారం రాత్రి 8 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. సీఎం చంద్రబాబు ఎయిర్‌పోర్టులో చంద్రమౌళి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం చంద్రమౌళి సతీమణి నాగమణి, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. అనంతరం పార్థివదేహాన్ని మహాప్రస్థానం వాహనంలో జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న కనకదుర్గ ఆస్పత్రి వద్దకు తరలించారు. ఆయన ఇద్దరు కుమార్తెలు అమెరికా నుంచి గురువారం సాయంత్రం నగరానికి చేరుకుంటారు. శుక్రవారం అంత్యక్రియలు జరగనున్నాయి. సీఎం వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు ఉన్నారు.

నవ్వుతూ వెళ్లారు..

దాబాగార్డెన్స్: కనకదుర్గ ఆస్పత్రి వద్ద చంద్రమౌళి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడి వారిని కలచివేశాయి. 'నవ్వుతూ వెళ్లారు, విగతజీవిగా తిరిగి వచ్చి అందరినీ ఏడిపించారు.' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎప్పుడూ అందరితో సరదాగా ఉండే చంద్రమౌళి అకస్మాత్తుగా తమను విడిచి వెళ్లడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటూ విలపించారు.

క్లుప్తంగా

ఆరోపణలపై విచారణ చేయండి


కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. కొద్ది రోజులుగా కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తనపై ఆరోపణలు చేస్తున్నాడని.. ప్రభుత్వ భూమిని తానెక్కడ కబ్జా చేశానో తేల్చాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తన, తన కుటుంబ సభ్యుల పేరుతో రెవెన్యూస్థలాలున్నాయో సర్వే చేయించాలన్నారు. గ్రీన్ బెల్టులు ఆక్రమించినట్లు మూర్తి యాదవ్ ఆరోపిస్తున్నాడని, అలాంటి వాటిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. గ్రేటర్ విశాఖ పరిధిలో 98వ వార్డుల్లో గ్రీన్ బెల్టుల అభివృద్ధి 52వ వార్డు నుంచే మొదలైందని గుర్తు చేశారు.

లేటు వయసులో ఇంటర్ ఉత్తీర్ణత

- 63 ఏళ్ల వయసులో ఫస్ట్‌క్లాస్‌లో పాసైన అప్పారావు



అగనంపూడి: చదువు పట్ల ఆసక్తి, ఏదైనా సాధించాలనే తపన ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని నిరూపించారు పట్టా రామ అప్పారావు. అగనంపూడి నిర్వాసిత కాలనీలోని కొండయ్యవలసకు చెందిన అప్పారావు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి ఐదేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు కళలతో పాటు విద్యపై మక్కువ ఎక్కువ. ఈ ఆసక్తితోనే 63 ఏళ్ల వయసులో ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరై ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. విశేషమేమిటంటే ఆయన 1977లో 10వ తరగతి పరీక్షలు ఉత్తీర్ణులై, వెంటనే ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించి విధుల్లో చేరారు. దాదాపు 48 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఫస్ట్‌క్లాస్‌లో పాసవడం ఆయనకు చదువు పట్ల ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తోంది. చదువుకోవాలనే కోరిక, కృషి ఉంటే వయసు ఎప్పుడూ అడ్డుకాదని పట్టా రామ అప్పారావు నిరూపించారు.

బహుళ నైపుణ్యాలు అవసరం

విశాఖ సిటీ: పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా యువత బహుళ నైపుణ్యాలతో రాణించాల్సిన అవసరం ఉందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని సాగరిక కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పుస్తక జ్ఞానం ఒక్కటే సరిపోదన్నారు. ప్రతి శాస్త్రంతో సాంకేతికత, ఏఐ, ఎంఎల్ వంటివి అనుసంధానం అవుతున్నాయని, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో కూడా వీటి ప్రాముఖ్యత ఉందన్నారు. ఏయూ సిబ్‌లో విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసించడానికి వస్తున్నారని, తద్వారా భారతీయ విద్యార్థులకు విభిన్న సంస్కృతులను పరిచయం చేసుకోవడానికి, తెలుసుకోడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక శాతం విదేశీ విద్యార్థులను కలిగిన విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తోందన్నారు. విద్యార్థులకు విదేశాల్లో సైతం ఇంటర్న్‌షిప్ అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ 26 దేశాలకు చెందిన విద్యార్థులు తమ వద్ద విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఏయూ సిబ్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, కుటుంబీకులు

అందివచ్చిన కొడుకు.. అనంత లోకాలకు

- మైథాన్ అల్లాయ్ పరిశ్రమ వద్ద లారీని ఢీకొన్న బైక్
- ఘటనా స్థలిలోనే మరణించిన వివేక్
- ప్రాణాపాయ స్థితిలోఉన్న లోహిత్‌కు టెన్త్‌లో 565 మార్కులు

అచ్యుతాపురం రూరల్: బాధ్యత తెలిసిన కొడుకు. స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలో శిక్షణ పొందుతూ, టాటా కంపెనీలో ఉద్యోగం కూడా సాధించాడు. తమకు చేదోడువాదోడుగా ఉంటాడనుకున్నారు. వచ్చే నెల్లో హైదరాబాద్‌లోని సంస్థలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఇంతలోనే బుధవారం మైథాన్ అల్లాయ్ పరిశ్రమ వద్ద జరిగిన దుర్ఘటనలో అక్కడికక్కడే మరణించి, ఆ కుటుంబానికి తీరని శోకం మిగిల్చాడు. ఈ ఘటనలో పూడిమడక గ్రామానికి చెందిన ఈరిగిల వివేక్ (19) సంఘటనా స్థలంలో మృతి చెందగా, సత్తాడ లోహిత్ కొన ఊపిరితో వైజాగ్‌లోని పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు వివేక్, క్షతగాత్రుడు లోహిత్ ముత్యాలమ్మపాలెం అమ్మవారిని దర్శించుకునేందుకు బైక్‌పై వెళ్తున్నారు. అచ్యుతాపురం సెజ్ వద్ద మైథాన్ అల్లాయ్స్ పరిశ్రమలోకి వెళ్లేందుకు అకస్మాత్తుగా ఎడమవైపు రోడ్డు నుంచి కుడి వైపునకు తిరుగుతున్న భారీ కంటైనర్‌ను ఎదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వివేక్ మరణించాడు. పరిశ్రమలో ఉన్న అంబులెన్స్ సాయంతో వివేక్‌ను ఆస్పత్రికి తరలించినట్లైతే ప్రాణం కోల్పోయేవాడు కాదని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ ఎదుట ప్రమాదం జరిగి సుమారు 30 నిమిషాల వరకూ చూస్తూ ఉండిపోయారు తప్ప, తక్షణ సాయం చేసే ఆలోచన పరిశ్రమ యాజమాన్యం చేయలేదని ఆరోపించారు.

కన్నీరు మున్నీరుగా కుటుంబీకులు

మృతి చెందిన వివేక్ స్థానిక ఎంఎస్ఎంఈ స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలో థర్డియర్ శిక్షణ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లోని టాటా కంపెనీలో ఉద్యోగం పొందాడు. మే నెలలో విధుల్లో చేరేందుకు అన్నీ సమకూర్చుకునే సమయంలో ఈ దుర్ఘటన జరగడం ఆ కుటుంబాన్ని కలచివేసింది. చేతికి అందివచ్చిన సమయంలో విగత జీవిగా మారడంతో కుటుంబీకులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

మెరిట్ విద్యార్థి లోహిత్

క్షతగాత్రుడు లోహిత్‌కుమార్ స్థానిక శ్రీభవాని విద్యానికేతన్‌లో చదువుకున్నాడు. తాజాగా విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో 565 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. భవిష్యత్తులో ఉన్నత విద్యలు చదివి, మంచి ఉద్యోగం తెచ్చుకుని, తల్లిదండ్రులను చక్కగా చూసుకుంటానని ఎప్పుడూ అనేవాడని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు. ప్రాణాలతో దక్కితే చాలని భగవంతుడిని వేడుకుంటున్నారు.

ఈ ఘటనపై గ్రామస్తులు పరిశ్రమ ఎదుట భారీ ఆందోళన చేపట్టారు. ప్రమాదంపై పూర్తి విచారణ చేపట్టి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని మత్స్యకారులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక సీఐ నమ్మి గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


మృతుడు ఈరిగిల వివేక్ (ఫైల్)


లారీని ఢీకొన్న తర్వాత ఘటనాస్థలిలో పడివున్న వివేక్(మృతుడు), లోహిత్(క్షతగాత్రుడు)


ఈరిగిల వివేక్ మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదన

హైవే వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


మృతురాలు నూకాలమ్మ

యలమంచిలి రూరల్: హైవే నిర్వహణ పనులు చేపడుతున్న వాహనం ఢీకొని పులపర్తి ఎన్నీ కాలనీకి చెందిన లూడా నూకాలమ్మ (62) బుధవారం మృతి చెందింది. మండలంలోని పులపర్తి హైవే కూడలికి సమీపంలో రోడ్డు దాటుతున్న నూకాలమ్మను హైవే నిర్వహణ పనుల కాంట్రాక్టు సంస్థకు చెందిన సిగ్నల్ వ్యాన్ వెనుకకు మళ్లిస్తూ ఢీకొట్టింది. దీంతో ఆమె శరీర భాగాలు నుజ్జయ్యాయి. వాహనం నడుపుతున్న డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు సాక్షికి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే హైవే అంబులెన్సు వాహనంలో నూకాలమ్మను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయినట్టు నూకాలమ్మ బంధువు అచ్చన్న తెలిపారు. మృతురాలు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ మేరకు యలమంచిలి రూరల్ పోలీసులకు మేనకోడలు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. 16వ నెంబరు జాతీయ రహదారి నిర్వహణ పనులు చేపడుతున్న ప్రాంతాల్లో కాంట్రాక్టు సంస్థ సిబ్బంది నిబంధనలు పాటించకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. నిర్వహణ పనులు చేస్తున్న ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలో సూచికలతో కూడిన సమాచారం ఇవ్వాల్సి ఉండగా, ఖర్చు తగ్గించుకునేందుకు నిర్వహణ సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలున్నాయి.

స్కాముల్లో చంద్రబాబు దిట్ట

- లిక్కర్ స్కాం జరిగింది చంద్రబాబు పాలనలోనే..
- ఖజానాకు చేరాల్సిన రూ.5 వేల కోట్లు కూటమి నేతల జేబుల్లోకి
- మద్యం కేసులో వైఎస్ జగన్ పేరు చేర్చే కుట్ర చేస్తున్నారు
- మీడియా సమావేశంలో మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

సాక్షి, విశాఖపట్నం: స్కామ్‌ల్లో చంద్రబాబు దిట్ట.. రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ జరిగింది కూటమి ప్రభుత్వంలోనేనని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 11 నెలల పాలనలో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. ఎంఆర్‌పీ కన్నా అధికంగా మద్యం దుకాణాల్లో మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రస్తుతం చంద్రబాబు పాలనలో దొంగే దొంగ అన్నట్లు ఉందని, టీడీపీ నేతల కనుసన్నల్లోనే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. నాణ్యమైన మద్యం అందిస్తామని నాసిరకమైన మద్యాన్ని అమ్ముతున్నారంటూ మండిపడ్డారు. నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి మద్యం పేరు చెప్పి ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రూ.5 వేల కోట్లు కూటమి నేతల జేబుల్లోకి వెళ్తున్నాయంటూ ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో వారి పార్టీ నాయకులకు అడ్డదారిలో డిస్టిలరీ అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ రంగంలో నాణ్యమైన మద్యం అమ్మకాలు జరిగాయని, ప్రభుత్వ రంగంలో మద్యం షాపులు నిర్వహిస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందే తప్ప, లంచాలు వస్తాయా.. అని ప్రశ్నించారు. ప్రైవేట్ రంగంలో మద్యం షాపులు నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వంలోనే లంచాలు వస్తాయన్నారు. తమ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మద్యం పాలసీలో ఒక్క బెల్టు షాపు అయినా కనిపించిందా? అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలపై కేసులు పెడుతున్నారని, మద్యం కేసులో వైఎస్ జగన్ పేరు చేర్చే కుట్రకు ఈ కూటమి ప్రభుత్వ పాల్పడుతోందని ఆరోపించారు. అంతేకాకుండా 2014–19 టీడీపీ పాలనలో చంద్రబాబు మీద ఉన్న మద్యం కేసులపైన విచారించే దమ్ముందా...? అంటూ ప్రశ్నించారు.

పాత్రికేయుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

- ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడి ఆక్షేపణీయం
- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

అనకాపల్లి: అక్రెడిటేషన్ నియమావళికి సంబంధించిన జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, అర్హులైన జర్నలిస్టులందరికీ సకాలంలో అక్రెడిటేషన్లు ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర జిల్లా ఉమ్మడి ప్రాంతీయ సదస్సు బుధవారం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా ఇంత వరకూ జర్నలిస్టుల సమ్యలను పట్టించుకోవట్లేదన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏలూరులో సాక్షి కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ దేశంలో మీడియా స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయాయన్నారు. సోషల్‌మీడియా విస్తరణ వల్ల జర్నలిజం లక్షణాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మీడియా స్థితిగతులను అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఏడాది మే రెండు లేదా మూడో వారంలో ఏపీయూడబ్ల్యూజే 37వ జాతీయ మహాసభ తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అక్రెడిటేషన్ల సమస్యపై అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని సభ హెచ్చరించింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఏలూరులో సాక్షి కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరుల చర్యను మరో తీర్మానంలో తీవ్రంగా ఖండించింది. వెంటనే బాధ్యులను అరెస్టు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. ఐజేయూ కార్యవర్గ సభ్యుడు, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, అనకాపల్లి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్, మద్దాల రాంబాబు, ఈశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు సీహెచ్‌ఎల్పీ స్వామి, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి చింతల కిషోర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మళ్ల భాస్కర్, భీమరశెట్టి గణేష్, భీమరశెట్టి నూకేష్, సర్వారావు(అవ్వా), జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి మంచి భవిష్యత్


గంగిరెడ్ల వెంకటరమణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

పాయకరావుపేట: పార్టీలో కష్టపడి పని చేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని, తద్వారా మంచి భవిష్యత్ దక్కుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని శ్రీరాంపురం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత దివంగత గంగిరెడ్ల వెంకటరమణ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో విఫలమయ్యారని ఆక్షేపించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ కీర్తిశేషులు గంగిరెడ్ల వెంకటరమణ గ్రామానికి, పార్టీకి చేసిన సేవలిన గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తిరుమలరాజు నరసింహారావు, సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, చేపల నాగమణి, పందిరి ధర్మాజీ, నాయకులు దేవవరపు వెంకటేశ్వరరావు, పల్లేల కృష్ణార్జునరావు, పల్లేల వెంకట్, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, బీసీ సెల్ నాయకుడు యజ్జల సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, నియోజకర్గ సోషల్‌మీడియా ఇన్‌చార్జి కొంకిపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- భర్త మరణించిన 15 నిమిషాలకే భార్య కన్నుమూత



సత్యనారాయణ, రామయ్యమ్మ(ఫైల్)

పద్మనాభం: బంధం అంటే ఆ దంపతులదే. మృత్యువు కూడా వారిని విడదీయలేకపోయింది. భర్త ఈ లోకం విడిచి వెళ్లిన కొద్ది నిమిషాలకే భార్య కూడా ఆయన వెంటే పయనమైంది. పద్మనాభం మండలం రెడ్డిపల్లి పంచాయతీ రామన్నపేటలో చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా అందరినీ కలచివేసింది. రామన్నపేటకు చెందిన సుంకర సత్యనారాయణ (78) కొంతకాలం కిందట పక్షవాతం బారినపడి కోలుకున్నారు. పది రోజులుగా తన పనులను తానే చేసుకుంటూ చురుగ్గా తిరుగుతున్నారు. అయితే మంగళవారం సాయంత్రం సత్యనారాయణ అకస్మాత్తుగా మృతి చెందారు. భర్త మృతదేహం వద్ద భార్య రామయ్యమ్మ (73) గుండెలవిసేలా రోదించింది. ఆ దుఃఖంలోనే, భర్త చనిపోయిన 15 నిమిషాల వ్యవధిలోనే తుదిశ్వాస విడిచింది. మృత్యువు కూడా వారిని విడదీయలేక ఒకే సారి ఇద్దరినీ తీసుకువెళ్లిపోవడం అందరినీ కంటతడి పెట్టించింది. వారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరి మృతదేహాలకు పక్కపక్కనే కూర్చోబెట్టి స్నానం చేయించారు. అనంతరం ఒకే పాడెపై ఉంచి అంతిమయాత్ర నిర్వహించారు.

పది ఫలితాల్లో శ్రీప్రకాష్ ప్రభంజనం






నందవరపు భానుతేజస్ సామిరెడ్డి గీతిక కడిమి అర్చన రేఖ సకురు రుత్విక మాదాన స్నేహిత్

పాయకరావుపేట: పదో తరగతి పరీక్ష ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. నందవరపు భానుతేజస్ 594, సామిరెడ్డి గీతిక 593, కడిమి అర్చన రేఖ 592, సకురు రుత్విక 592, మాదాన స్నేహిత్ 590 మార్కులు సాధించి అగ్రగాములుగా నిలిచారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. తమ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 550కి పైగా మార్కులు 91 మంది, 500 పైగా మార్కులు 155 మంది విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రధానోపాధ్యాయులు డీవీ శ్రీనివాస్, సీతారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

బైక్ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ వ్యక్తి మృతి


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అచ్చిబాబు

కె.కోటపాడు: ఈ నెల 21న కె.సంతపాలెం జంక్షన్ సమీపంలో బైక్ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ అదే గ్రామానికి చెందిన సర్వసిద్ధి అచ్చిబాబు(50) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. మృతుడి భార్య శ్రీరాములమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. కె.సంతపాలెం జంక్షన్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న అచ్చిబాబును పాతవలస గ్రామం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో అచ్చిబాబు తలపై బలమైన గాయమైంది. ఆయన్ని కె.కోటపాడు సీహెచ్‌సీలో చేర్చి, ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అదే రోజు రాత్రి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న అచ్చిబాబు ఆరోగ్య పరిస్థితి మరింతగా దిగజారి, మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బుధవారం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ధనుంజయ్ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న అచ్చిబాబు ప్రమాదంలో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి: విశాఖ– అనకాపల్లి రైల్వే మార్గంలోని కొప్పాక రైల్వే బ్రిడ్జి సమీపంలో విశాఖ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి మీడియాకు బుధవారం తెలిపారు. రైలు నుంచి జారిపడి తలకు బలమైన గాయాలు తగిలి మరణించినట్లు పేర్కొన్నారు. గుర్తుపట్టలేని విధంగా మృతదేహం ఉందని, మృతుడి ఎత్తు 5.3 అడుగులు, నలుపు రంగు జుట్టు, గ్రీన్ ఫుల్ హ్యాండ్ చొక్కా, నేవీ బ్లూ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లాను తొలగించాలి

డాబాగార్డెన్స్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆ పదవి నుంచి తొలగించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్లా శ్రీనివాసరావు తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని, ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి అనర్హుడన్నారు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్ట్


పోలీసులు అరెస్ట్ చేసిన కంటమరెడ్డి రవి

యలమంచిలి రూరల్: మద్యపానం, జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం మొబైల్ ఫోన్లు, నగదు దొంగతనం చేసిన ఒక యువకుడిని యలమంచిలి పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. ఈ నెల 17న అర్ధరాత్రి యలమంచిలి పెంజెరువు సమీపంలో వరి ధాన్యం నూర్పుపని నిమిత్తం కోనసీమ జిల్లా నుంచి వచ్చిన కూలీలు పెంజెరువు దుర్గమ్మ గుడి వద్ద నిద్రపోతున్నారు. ఆ సమయంలో కూలీలకు చెందిన రెండు సెల్ ఫోన్లు, రూ.40 వేల నగదు చోరీకి గురయ్యాయి. దీనిపై కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన బాధితుడు మేరిన్ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసిన పట్టణ పోలీసులు యలమంచిలి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన కంటమరెడ్డి రవిని నిందితుడిగా గుర్తించారు. బుధవారం నిందితుడ్ని అరెస్ట్ చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపారు. నిందితుడు ఐటీఐ వరకు చదువుకుని రైల్వే కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడని, మద్యానికి అలవాటు పడిన చోరీకి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. గూడ్స్ రోడ్, కోట్నివీధి, వాటర్ ట్యాంక్ ఏరియా, ఆమంచి వారి వీధి, వేల్పులవీధి, నరసింగరావు పేట, టెలిఫోన్ ఎక్సైంజ్ వీధి, చవితిని వీధి, జార్జి క్లబ్ ఏరియా, జీవీ కోటేశ్వరరావు వీధి, ఎల్ఎన్ నగర్, గొల్లవీధి, పిల్లావారి వీధి, యర్రావారి వీధి ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని విద్యుత్ నగర్‌కు చెందిన ఐలాల మనీషా(28) అనే యువతి అదృశ్యమైంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం మనీషా పెళ్లి జరగాల్సి ఉండగా.. మంగళవారం రాత్రి నుంచి ఇంటిలో కనిపించకుండా పోయిందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వెంకన్నకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ పరిశ్రమలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ప్రతి ఏటా ఇక్కడ పరిశ్రమ క్వార్టర్స్‌లో ఉన్న వ్యూహ లక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నుంచి శాస్త్రోక్తంగా వేడుకలు జరిపారు. చివరి రోజు స్వామివారికి చక్రస్నానం వేద మంత్రోచ్చారణల మధ్య పూర్తి చేశారు. ముందుగా వెంకన్నకు 108 కలశాలతో మైహోమ్ గ్రూప్ సంస్థల అధినేత జూపల్లి రామేశ్వరరావు దంపతులు అభిషేకం నిర్వహించారు. కర్మాగారం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈగా సురేష్‌కుమార్



డీఈగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్

పాయకరావుపేట: నీటి పారుదల శాఖ డీఈగా ఎం.వి.సురేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఏఈ కె.శ్రీరామమూర్తి తెలిపారు. ఇంతవరకు ఇక్కడ డీఈగా పనిచేసిన ఎస్.జగదీశ్వరరావు పదవీ విరమణ చేసినట్టు చెప్పారు. సురేష్‌కుమార్ శ్రీకాకుళం నుంచి పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 1,266 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,960	4,590
రెండో రకం	3,430	4,190
మూడో రకం	3,090	3,420

అనకాపల్లి సినిమాలు

రాజా : మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : కోర్టు
శ్రీసత్య : మధురం
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 9703619706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

మెరిసిన మట్టిలో మాణిక్యాలు

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన 2024–25 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అనకాపల్లి నియోజకవర్గంలోని విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో చదువుకున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఆయా ఎంఈవోలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించి, సన్మానం చేశారు.

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మార్కులు
- అభినందించిన ఎంఈవోలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



శ్రీవివేకానంద స్కూలులో టాపర్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మళ్ల జగదీష్

జీవీఎంసీ పాఠశాలల విద్యార్థుల సత్తా

అనకాపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాలలో జీవీఎంసీ అనకాపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. జోన్ పరిధిలో ఆరు ఉన్నత పాఠశాలల నుంచి 543 మది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 442 మంది ఉత్తీర్ణులయ్యారు. 81.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెయిన్ రోడ్ పెద్ద హైస్కూల్లో 110 మంది విద్యార్థులకు 84 మంది పాసయ్యారు. పాఠశాల టాపర్‌గా ఎం. వైభవ్ శ్యామ్‌కుమార్(586) నిలిచాడు. టౌన్ గరల్స్ హైస్కూల్‌లో 162 మందికి 150 మంది ఉత్తీర్ణులవ్వగా.. పాఠశాల టాపర్‌గా కుందల లిఖిత(590) నిలిచింది. గవరపాలెం 28వ వార్డు హైస్కూల్‌లో 91 మంది విద్యార్థులకు 65 మంది పాసయ్యారు. వి.శ్రీవల్లి(578) స్కూల్ టాపర్‌గా నిలిచింది. గాంధీనగరం హైస్కూల్‌లో 112 మంది విద్యార్థులకు 84 మంది ఉత్తీర్ణులయ్యారు. సి.హిమశ్రీ(573) స్కూల్ టాపర్‌గా నిలిచింది. గవరపాలెం 27వ వార్డు హైస్కూల్‌లో 55 మందికి 47 మంది పాసయ్యారు. ఇ.భవ్యశ్రీ(561) స్కూల్ టాపర్‌గా నిలిచింది. భీమునిగుమ్మం హైస్కూల్‌లో 13 మందికి 12 మంది ఉత్తీర్ణులయ్యారు. మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు 65 మందికి 65 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల టాపర్‌గా ఎస్.సంజయ్(573) మెరిశాడు. స్థానిక భాష్యం స్కూల్ విద్యార్థిని కనుమూరి ఉమాదేవి 591 మార్కులతో సత్తా చాటింది.



కుందల లిఖిత(590) పట్టణ గర్ల్స్ హైస్కూల్



కనుమూరి ఉమాదేవి(591)

కశింకోట: కశింకోటలోని బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎం.గౌరీ 579 మార్కులతో సత్తా చాటింది. పి.దీపిక, ఆర్.సాయి సాహిత్య 578 మార్కులతో మెరిశారు. 139 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 30 మంది 500 పైబడి మార్కులు సాధించారు. వారిని హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ఈ ఏడాది 78 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 78 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిని హెచ్ఎం ఎంఆర్ అప్పారావు, విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కశింకోట: తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 88.75 శాతం ఉత్తీర్ణత సాధించారు. 80 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 71 మంది ఉత్తీర్ణులయ్యారు. 585 మార్కులతో కె.లక్ష్మీగాయత్రి సత్తా చాటింది. కె.అర్పిత రేచల్(568), జి.షకీన(556) మెరిశారు. వారిని ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కశింకోట: తేగాడలోని ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ స్కూలు నుంచి 76 మంది పరీక్షలు రాయగా.. అంతా ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 40 మందికి 39 మంది ఉత్తీర్ణులయ్యారు. బయ్యవరం హైస్కూలు నుంచి 48 మందికి 34 మంది పాసయ్యారు. జమాదులపాలెం స్కూలు నుంచి 34 మందికి 31 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ.చౌడువాడ(కన్నూరుపాలెం) నుంచి 55 మందికి 49 మంది ఉత్తీర్ణత పొందారు. ఆర్.గాయత్రి 573 మార్కులతో సత్తా చాటింది. నరసింగబిల్లి స్కూలు నుంచి 73 మందికి 62 మంది ఉత్తీర్ణులు కాగా.. 584 మార్కులతో ఆర్.పావని సత్తా చాటింది. అమీన్‌సాహెబ్‌పేట స్కూలు నుంచి 18 మందికి 15 మంది ఉత్తీర్ణులయ్యారు. వెదురుపర్తి స్కూలు నుంచి 21 మందికి 17 మంది పాసయ్యారు. కొత్తపల్లి స్కూలు నుంచి 58 మందికి 36 మంది ఉత్తీర్ణులయ్యారు. తాళ్లపాలెం హైస్కూలు నుంచి 91 మందికి 72 మంది ఉత్తీర్ణత సాధించారు.

'పది'లో ప్రైవేట్ స్కూళ్ల హవా

కశింకోట: స్థానిక శ్రీవివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. 38 మంది విద్యార్థులకు అంతా ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బొండా చరణ్‌సాయి 592 మార్కులతో సత్తా చాటాడు. మనవల్లి మనస్వీ(590) మళ్ల గుణప్రియ(586) ప్రతిభ కనబరిచారు. వారిని కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ప్రిన్సిపాల్ ఎం.శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



ఎం.గౌరీ(579)



పి.దీపిక(578)



ఆర్.సాయి సాహిత్య(578)

- స్థానిక సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులయ్యారు. 24 మంది పరీక్షలకు హాజరు కాగా, వారంతా ఉత్తీర్ణులయ్యారు. జి.పూర్ణసాయి(587) డి.గ్రీష్మసాయిశ్రీ(582), ప్రధాన్ ప్రవీణ్, వర్రి కీర్తిశ్రీ 575 మార్కులతో సత్తా చాటారు. 8 మంది 550 మార్కులు, 14 మంది 500 మార్కులు పైబడి సాధించారని స్కూల్ కరస్పాండెంట్ బి.అనూరాధ తెలిపారు. తాళ్లపాలెం గాయత్రి స్కూలు విద్యార్థులు కొల్లు మోహన్(592), ఒమ్మి కార్తీక్(586), సుగ్గు శ్రీవెంకట్(585) సత్తా చాటారు. వీరిని స్కూలు కరస్పాండెంట్ బి.రాంకుమార్, హెచ్ఎం వై.నగేష్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కశింకోట: తాళ్లపాలెంలోని భార్గవి విద్యా మందిర్ స్కూలు విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. సిహెచ్.దీపిక 594 మార్కులతో సత్తా చాటింది. కన్నూరుపాలెం గీత హైస్కూలు విద్యార్థులు కూడా శత శాతం ఉత్తీర్ణులయ్యారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని హిమశేఖర్ కళాశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులయ్యారని కళాశాల కరస్పాండెంట్ కె.జనార్దన్ తెలిపారు. వీరిలో బి.రోహిత్ 578, వి.జయశ్రీ 577, ఎం.తన్మైశ్రీ 575, ఎ.పోషిక్ 575, ఎస్.ధనశ్రీ 574, ఎ.కుశ్వంత్ సాగర్ 574 మార్కులతో సత్తా చాటారు.



విజయకేతనం చూపిస్తున్న హిమశేఖర్ కళాశాల విద్యార్థులు, కరస్పాండెంట్ జనార్దన్



జి.పూర్ణసాయి(587), సెయింట్ జాన్స్ హైస్కూల్



గ్రీష్మసాయిశ్రీ(582), సెయింట్ జాన్స్ హైస్కూల్

బాలికలదే పై చేయి



శరణ్యశ్రీలక్ష్మిని అభినందిస్తున్న తల్లిదండ్రులు వెంకట చిరంజీవి, హరివేణి

కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ పరీక్షా ఫలితాల్లో బాలికలదే పై చేయిగా నిలిచింది. టాపర్లుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బాలికలే నిలిచారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో అమీన్‌సాహెబ్‌పేట జెడ్పీ పాఠశాలకు చెందిన మలసాల శరణ్య శ్రీలక్ష్మి అత్యధికంగా 590 మార్కులతో ఉత్తీర్ణత సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన కె.ఎల్.గాయత్రి(585), నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆర్. పావని(584) సత్తా చాటారు.

85 శాతం ఉత్తీర్ణత

మండలంలో 13 ప్రభుత్వ పాఠశాలలుండగా, వాటిలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, తేగాడలోని కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూలు, తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయి. వీటి నుంచి 813 మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాశారు. వీరిలో 693 మంది బాల బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 85 శాతం ఉత్తీర్ణత లభించింది.

ట్రిపుల్ ఐటీలో చేరుతా..



ట్రిపుల్ ఐటీలో చేరుతా. ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం. అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు వెంకట చిరంజీవి, హరివేణి, ఉపాధ్యాయులు తనకు ఎంతో సహకరించారు.

– మలసాల శరణ్య శ్రీలక్ష్మి(590), అమీసాహెబ్‌పేట జిల్లా పరిషత్ హైస్కూలు

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మండల నాయకులు, ప్రజలు

అచ్యుతాపురం రూరల్: కశ్మీర్ పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా బుధవారం మండల కేంద్రం అచ్యుతాపురంలో యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. 28 మందిని ఉగ్రవాదులు హతమార్చడాన్ని విజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో మండల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సత్కారం



భీమవరంలో ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ రైతులకు సత్కారం

కశింకోట: మండలంలోని జి. భీమవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగులో ఉత్తమ రైతులను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా తురకలపూడి సూరిబాబు, పప్పల సూర్య కుమారిలను ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా మేనేజర్ లచ్చన్న దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. ఖరీఫ్ పంటల ప్రణాళిక, భూముల సారవంతానికి వేయాల్సిన నవ ధాన్యాల ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ సీనియర్ థిమెటిక్ లీడ్ చంద్రశేఖర్, రీజనల్ థిమెటిక్ లీడ్ ప్రకాష్ , సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామ దేవతల పండగ మహోత్సవాలు



పరవాడ: మండలంలో వెన్నలపాలెం, రావాడ శివారు జల్లెలపాలెం గ్రామాల్లో కొలువుదీరిన గ్రామదేవతలు దుర్గమాంబ, మరిడిమాంబ పండగ మహోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వేకువ జాము నుంచి భక్తులు గ్రామ దేవతలను దర్శించుకునేందుకు వీలుగా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను అందించనున్నట్లు తెలిపారు. రాత్రికి అమ్మవార్లను ఆయా గ్రామాల పురవీధుల్లో డప్పువాయిద్యాలు, చిడతలు, సాముగరిడీలు, తప్పెటగుళ్లు, నేల డ్యాన్సులతో ఊరేగిస్తామన్నారు. భారీ బాణసంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పండగను పురస్కరించుకుని గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు ఉత్సవ కమిటీల ప్రతినిధులు వెల్లడించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు

ఎస్.రాయవరం: ప్రభుత్వ భూములు, గోర్జిలు, చెరువు గట్లను ఆక్రమిస్తే సహించేది లేదని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ హెచ్చరించారు. గ్రామంలోని చెరువు గట్టు ఆక్రమణపై జల వనరుల శాఖ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 41లోని సుమారు 7.12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు సుమారు 100 ఏళ్లకు పైగా ఆయకట్టు రైతులకు సాగు నీరందిస్తోందని, అటువంటి చెరువుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే రెండు దఫాలు ఆక్రమించి చెరువు గర్భం పాడు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబర్లు 8, 15, 23, 26, 30 గల గోర్జి ద్వారా చెరువుకు నీరు వచ్చేదని, ఇప్పుడు అది కూడా ఆక్రమణలకు గురకావస్తోందని చెప్పారు. ఆక్రమణల్లో భాగంగా మట్టి తవ్విన ప్పుడు పొలాలు లోతట్టు ప్రాంతాలుగా మారడంతో ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వ ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి రైతుల సాగుయోగ్యాన్ని కాపాడాలని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే సమగ్ర వికాస నివాసాలు

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సమగ్ర వికాసానికి నిలయాలని, వారి ఉజ్వల భవిష్యత్ కోసం గ్రామాల్లో ఉండే పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యా శాఖాధికారి ఎస్.లక్ష్మణరావు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. మండలంలోని బాటజంగాలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా 5వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్-తల్లిదండ్రుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో, గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణతో కలిసి ఉపాధ్యాయులు రూపొందించిన అడ్మిషన్ల కరపత్రాన్ని, గోడ పత్రికలను ఆవిష్కరించారు. పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ సౌకర్యాలను ఉచితంగా ఉపయోగించుకునేలా ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన జానపద కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. తరగతుల వారీగా ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బోలెం శంకరరావు, హెచ్ఎం పి.తమ్మారావు, ఉపాధ్యాయులు శిరీష, స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో లక్ష్మణరావు తదితరులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



ప్రశంసా పత్రాలను అందుకున్న కళాకారులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో 27వ రోజైన బుధవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీరామాంజనేయ, సీతారామ కోలాట సంస్థలు, రాజరాజేశ్వరీ కూడిపూడి కళాక్షేత్రం నిర్వాహకులను సత్కరించి ప్రశంసా ప్రతాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణామూర్తి, కాండ్రేగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.